ఓం సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః

★ సోమవారం పారాయణ ప్రారంభం ★

శ్రీ సాయి లీలామృతము

అధ్యాయము - 20

సాయి నాటిన కల్పవృక్షాలు

పండ్లను బట్టి చెట్టును విలువకట్టాలి. అలానే ఎందరిని పరిపూర్ణులుగా చేశారన్న దానిని బట్టి ఆ సద్గురువును తెలుసుకోవచ్చు. కాని, అందరికంటే గొప్ప సిద్ధపురుషుడు భగవంతుడే. ఆయన అన్ని మతాలకూ చెందిన ఎందరిని అనంతమైన కాలగతిలో తన ప్రతిరూపాలుగా చేసి భూమిపై ప్రతిష్ఠించాడో ఎవరు చెప్పగలరు? కాని ఆయన దీనికంతటికీ కర్తృత్వమెన్నడూ వహించరు. అన్నీ తానే చేస్తున్న సంగతి జీవులకు తెలియనివ్వరు. సద్గురువులలోకెల్ల అగ్రేసరులైన సాయిబాబా వలన ఎందరు పూర్ణ పురుషులయ్యారో స్పష్టంగా తెలియడంలేదు. ప్రొద్దు గ్రుంకినకొద్దీ నక్షత్రాలొక్కొక్కటే, ఆకాశంలో ప్రకటమైనట్లు, కాలం గడుస్తుంటే శ్రీసాయివలన పూర్ణులైన వారి సంగతులొక్కొక్కటే బయటకొస్తున్నాయి. సాయి రెండవసారి శిరిడీకి వచ్చే ముందు గాఢ్గీ మహరాజ్ అను సిద్ధపురుషుని రూపొందించిన విషయం చూచాము.

శ్రీ ఉపాసనీ బాబా :- పాండిత్యానికి, భక్తికీ ప్రఖ్యాతి చెందిన మహారాష్ట్ర బ్రాహ్మణ 'ఉపాసనీ' కుటుంబంలో మే 5, 1870న సట్నాలో జన్మించాడు కాశీనాథ్. బడి చదువులు విడచి కాలమంతా సంధ్యావందనం, యోగాభ్యాసము, విష్ణు సహస్రనామ పారాయణలో గడిపేవాడు. వివాహం చేశాక గూడ అతనిలో మార్పేలేదు. సరికదా ఒకనాడు ఇల్లు విడచి కాలినడకన నాసిక్ చేరాడు. రెండు నెలల తర్వాత తల్లికి జబ్బు చేసిందని తెలిసి, తిరిగివచ్చిన కొద్ది కాలానికే అతని భార్య, తల్లీ మరణించారు. పెద్దలు రెండవ వివాహం చేసినా మళ్ళీ ఇల్లు విడిచి వెళ్ళిపోయి, ఎన్నో కష్టాలోర్చి సాధు సాంగత్యం చేస్తుండేవాడు. తర్వాత మళ్ళీ స్వగ్రామమైన సట్నాకు వెళ్తూండగా ఒక అడవిలో ఒక కొండమీద గుహ కన్పించింది. అందులో కూర్చొని ప్రాయోపవేశం చేయదలచి ఒక పెద్దచెట్టు పైకెక్కి అందులో దూకాడు. అక్కడ నిరంతరం జపంచేస్తూ త్వరలో బాహ్యస్మృతి కోల్పోయాడు. ఒకనాడు మెలకువ వచ్చినపుడు ఒక దివ్యదర్శనమైంది. ప్రక్కన ఎవరో నిల్చొని అతని చర్మం వలుస్తున్నారు. భయపడి కళ్ళు తెరిచేసరికి ఎవరూలేరు. మళ్ళీ బాహ్యస్మృతి కలిగేసరికి విపరీతమైన దాహమేసింది. ప్రక్కనే వాననీరు చిన్న మడుగుకట్టివుంటే త్రాగి, వాటితో శరీరం తుడుచుకున్నాడు. నాల్గవరోజు మరో దర్శనమైంది. దప్పికతో తానొక కాలువ దగ్గరకెడుతున్నాడు. తనకొకవైపు ఒక ముస్లిం సాధువు, మరోవైపొక సన్యాసి వున్నారు. వారిద్దరూ అతడి పాత చర్మం తీసివేసి, లోపల బంగారం వంటి దేహమతనికి చూపి, "ఎందుకు చావయత్నిస్తావ్? మేము నిన్నెన్నటికీ చావనివ్వము!" అన్నారు. అప్పుడతడు గుహనుండి దిగి, జూలై 22, 1890న ఇల్లు చేరాడు. ఎన్నో నెలల తరబడి తాను సమాధి స్థితిలో వున్నట్లు తెలుసుకొన్నాడు.

ఒక సం॥లోగా అతని తండ్రి, తాత, రెండవ భార్య మరణించారు. కుటుంబం అప్పుల పాలయ్యేసరికి లోకమాన్య బాలగంగాధర తిలక్‌గారు ఆదుకున్నారు. తర్వాత అతడు వైద్యమభ్యసించి అమరావతిలో గొప్ప వైద్యుడై శ్రీమంతుడయ్యాడు. గాని వ్యాపారంలో అంతా నష్టపోయాడు. బంధువులు మూడవ వివాహం చేశాక ఆ దంపతులు యాత్రలు చేశారు. ఓంకారేశ్వర్‌లో అతడు తీవ్ర సమాధి స్థితిలోనుండగా భార్య భయపడి నీరుచల్లి మేల్కొలిపింది. అప్పటినుండి అతనికి గాలి పీల్చడమెంతో కష్టమయ్యేది. నిద్రపోతే శ్వాస నిలిచిపోయేది. ఏ

వైద్యానికీ ఆ బాధతగ్గలేదు. చివరకు యోగంలో వచ్చిన బాధను యోగపూర్ణులే తొలగించగలరని తలచి, భార్యను ఇంటవదలి, 1911లో అట్టివారిని వెదుకుతూ బయలుదేరాడు కాశీనాథ్.

అతడు రాహురిలో యోగి కులకర్ణిని దర్శిస్తే ఆయన, "నీవు మంచి స్థితిలో వున్నావు. నిన్ను సాయిబాబా మాత్రమే ఉద్ధరించగలరు" అన్నారు. కాని, సాయి "ముస్లిమ్" అని తలచి, వారిని దర్శించలేదు కాశీనాథ్. తర్వాత దారిలో ఒక వృద్ధుడు కన్పించి, "చన్నీరు త్రాగవద్దు, వేడినీరు మాత్రమే త్రాగు!" అని చెప్పాడు. అతడా మాట లెక్కపెట్టక, వేరొకచోట నీరు త్రాగడానికి కాలువకు వెళ్తుంటే ఆ వృద్ధుడే మళ్ళీ ఎదురై మందలించి, ప్రక్క గ్రామంలో వేడినీరు త్రాగమని ఆదేశించి అంతర్ధానమయ్యాడు! కాశీనాథుడు ఆశ్చర్యపడి అలానే చేశాడు. బాధ చాలావరకు తగ్గింది. తర్వాత అతడు ఖేడ్‌గాంభేట్‌లో దత్తావతారంగా ప్రసిద్ధికెక్కిన శ్రీ నారాయణ మహరాజ్‌ను దర్శించాడు. ఆయన అతనికి తాంబూలమిచ్చి, "నీవు లోపల, బయట బంగారం పూసినట్లు, మంచి యోగస్థితిలో వున్నావు. నీవు కోరదగినదేమీ లేదు" అన్నారు. అతని బాధ మాత్రం తగ్గలేదు. అతడు మరలా యోగి కులకర్ణిని దర్శించాడు. ఆయన వెనుకటి సలహానే యిచ్చాడు. గత్యంతరంలేక జూన్ 27, 1911న శిరిడీ చేరాడు కాశినాథ్.

రెండు రోజులు సాయి సన్నిధిలో వుండడంతోనే అతని బాధ మటుమాయమైంది! అయినా అతనికి 'ఫకీరు' సన్నిధి దుర్భరమనిపించి తిరిగి వెళ్ళడానికి అనుమతి కోరాడు. "నీవు వెళ్ళొద్దు; వెడితే 8వ రోజుకు రావాలి!" అన్నారు బాబా. ఆ మాట అతనికి నచ్చలేదు. అపుడు సాయి, "సరే, వెళ్ళు. నేను చేసేది చేస్తాను" అన్నారు. కాశీనాథుడు పట్టుదలతో ఎంత వేగంగా నడచినా, 8వ రోజుకు 20 మైళ్ళలోనున్న కోపర్గాము చేరాడు! అక్కడ ప్రథమంగా శిరిడీ పోతున్న భక్తులు బలవంతాన అతనిని తోడుగా తీసుకెళ్ళారు. సాయి అతణ్ణి చూస్తూనే నవ్వి, "నీవు వెళ్ళి ఎన్ని రోజులయింది?" అన్నారు. ఎనిమిది రోజులయిందన్నాడు కాశీనాథ్. అప్పుడతనిని వాడాలో వుండమని బాబా ఆజ్ఞాపించారు. ఈసారి అతడు ఆయన మాటకు తలవొగ్గాడు.

శిరిడీలో నిత్యమూ భక్తుల అనుభవాలు వినడంతో అతని మనస్సు క్రమంగా మారింది. ఒకరోజు బాబా అతనివైపు చూచి నవ్వుతూ భక్తులతో అన్నారు -- "ఒకప్పుడు ఒక స్త్రీ గర్భిణియై కొన్ని సం॥లయినా ప్రసవించలేదు. ఆమెను వేడినీరు మాత్రమే త్రాగమని చెప్పాను. ఆమె నా మాట లెక్కచేయక నీరు త్రాగడానికి ఒక కాలువకు వెళుతున్నది. ఆమె గర్భంలోని బిడ్డలు నశిస్తారేమోనని నేను ఆమెను మరలా మందలించాను. ప్రక్క గ్రామంలో వేడినీరు త్రాగాక ఆమెకు బాధ చాలావరకూ తగ్గింది" అన్నారు. తనకు రెండుసార్లూ దర్శనమిచ్చిన వృద్ధుడు ఆయనేనని గుర్తించి పులకించాడు కాశీనాథ్, తర్వాత బాబా, "కొన్నివేల సం॥లుగా మనిద్దరికీ ఋణానుబంధ మున్నది" అని, "ఒక బావి ప్రక్క చెట్టుమీద రెండు పక్షులుండేవి. ఒకటి బావిలో పడితే దానిని రక్షించడానికి రెండవది తన ప్రాణాలు తెగించవలసి వచ్చింది" అన్నారు. మాయలోబడిన శిష్యుని రక్షించడానికి సద్గురువు అవతరించవలసి వచ్చిందని వారి భావం గాబోలు! తర్వాత కాశీనాథ్‌తో, "ఎవరితోనూ సంబంధం లేకుండా మౌనంగా ఖండోబా ఆలయంలో 4 సం॥లుండు; ఖండోబా కృప లభిస్తుంది" అన్నారు బాబా.

రోజూ శ్రీ కాశీనాథ్ స్వయంగా వంట చేసుకొని, మొదట మశీదులో సాయికి నివేదించి, తర్వాత భోజనం చేసేవాడు. ఒకరోజు "నేనక్కడికి వస్తే నీవు గుర్తిస్తావా?" అన్నారు బాబా. అతడికేమీ అర్థంగాలేదు. ఒకరోజొక నల్లకుక్క అన్నంకోసం అతని వెంటపడింది. దానిని తరిమేసి నివేదనతో మశీదు చేరగానే సాయి, "ఇంతదూరం రానక్కరలేదు. నేనక్కడే వున్నాను. ఆ నల్లకుక్కను నేనే!" అన్నారు. మరొకసారి అతడు వంట చేస్తుంటే ఒక బిచ్చగాడు ఆశగా చూస్తున్నాడు. ఆచారవంతుడైన కాశీనాథ్ అతనిని తిట్టి వెళ్ళగొట్టాడు. సాయి ఆనాడు నివేదన అంగీకరించక, "అక్కడ హరిజనుడి రూపంలోనున్న నన్ను తిట్టావు. నీవెక్కడ చూస్తే, అక్కడే వున్నాను గుర్తుంచుకో!" అన్నారు.

అతడు సాయి చెప్పినది మరచి వేదాంతగోష్ఠి చేస్తుంటే ఆయన మందలించేవారు. ఇలా 3 సం॥లకు పైగా గడచింది. ఆ కాలంలో అతడెన్నో బాధలనుభవించాడు. ముక్కోపము, ఆత్మాభిమానమూ గలవాడేమో, ఈ బాధలు మరీ తీవ్రంగా వుండేవి. ఒకప్పుడు కొన్ని మాసాలు అన్న ద్వేషమనుభవించాడు. తుంటరులైన యువకులు ఆయనను ఎన్నోరీతుల బాధించేవారు. ఆ బాధలు భరించలేక అతడెన్నోసార్లు శిరిడీ వదలి వెళ్ళాలనుకున్నాడు. కాని సాయి వెళ్ళనివ్వలేదు. "నీవిప్పుడెంత ఓర్చుకొంటే నీ భవిష్యత్తు అంత ఉజ్జ్వలంగా వుంటుంది. నాలుగు సం॥లు యిక్కడుంటే నా స్థితే నీకూ కల్గుతుంది" అనేవారు. కాని అతడు సుమారు 3 1/2 సం॥లున్నాక సాయితో చెప్పకుండా భక్తులతో కలసి ఖరగ్‌పూర్ వెళ్ళిపోయాడు. కాని అప్పటికే అతనిలో యోగశక్తులు ప్రకటమయ్యేవి. ఉదాహరణకు, నెవాసా నుండి కొందరు భక్తులతో నరహరి సాయిని దర్శించాడు. కాని ఆయన ముస్లిమని శంకించాడు. వెంటనే సాయి అతనికేసి ఉరిమిచూచారు. అతడు బయటకు పోయి ఖండోబాలో ఉపాసనీ శాస్త్రికి నమస్కరించబోయాడు. ఆయన తనకాళ్ళు వెనక్కు తీసుకుని, "నీవు బ్రాహ్మణుడవు, సాయి ముస్లిమ్! నువ్వాయనకు నమస్కరించకూడదు! అటువంటప్పుడు నీతో నాకేమి పని?" అన్నారు. చివరకు ఆయన శిరిడీ దగ్గరున్న సాకోరిలో ఉపాసనీ బాబాగా స్థిరపడి, డిసెంబర్ 24, 1941న సమాధి చెందారు. శ్రీ సాయి ఆదేశించినట్లు ఆయన 4 సం॥లు పూర్తిగా శిరిడీలోనే వుంటే ఏమయ్యేదో!

సయ్యద్ జలాలుద్దీన్ : రెడ్‌హిల్స్ (తమిళనాడు) లో 'స్వామియార్'గా ప్రసిద్ధికెక్కిన యీ మహనీయుడు పెషావర్‌లో జన్మించి, కొంతకాలం సైన్యంలో పనిచేశారు. ఈయన ఉన్మత్తావస్థలోనున్న అవధూతగా 'రెడ్‌హిల్స్' లో వుండేవారు. ఈయన ఏ అంగట్లో తినుబండారాలు తీసుకున్నా వారికి ఆ వ్యాపారం అద్భుతంగా జరిగేది. ఒకరోజు ఆయన వీధివెంట వెడుతుంటే ఒక పిచ్చివాడు ఎదురయ్యాడు. ఆయన అతని చెంపమీద కొట్టారు. వెంటనే అతనికి పిచ్చి తగ్గిపోయింది. ఎందరెందరో రోగులు ఆయన దగ్గరకొచ్చేవారు. ఆయన ఒక్కసారి రోగికేసి తీవ్రంగా చూచి, ఏదో గొణుగుతూ ఆకాశంకేసి చూచేవారు. వెంటనే ఆ రోగం తగ్గవలసిందే!

ఆయన 1955లో బుదూర్ అనే గ్రామం వద్ద సర్విితోటలో నివసించారు. వర్షాలు లేవని రైతులు ప్రాధేయపడితే ఆయన ఆకాశంకేసి చూచి ఏమో గొణిగేవారు. కొద్దిసేపట్లో తృప్తిగా వర్షం పడేది. ఒకసారి 10 రోజులు వర్షం కురిసి, అంతా జలమయమై, ఆ గ్రామానికి రాకపోకలు నిలిచిపోయాయి. ఆయన సన్నిధిలోవున్న, రామానుజం శెట్టియార్, కాశీ, మునుస్వామి, ఘనశ్యామ్ సింగులు తమకు వేడి వేడి బిర్యానీ పెట్టించమన్నారు. ఆయన పకపకా నవ్వి ఆకాశంకేసి చూచారు. అంతలో కుటీరం ముందు ఒక జట్కా ఆగింది. ఇద్దరు వ్యక్తులు పెద్ద పాత్రనిండా వేడిగా నేతితో వండిన చికెన్ బిర్యానీ, అరటి ఆకులూ తెచ్చిపెట్టి, త్వరగా పాత్ర ఖాళీచేసివ్వమన్నారు. భక్తులు వివరమడుగుతే, "మేమెక్కడ నుంచి వస్తే మీకెందుకు? మీరు కోరినది లభించింది కదా?" అన్నారు. భక్తులు విస్తుపోయి, తృప్తిగా తిన్నారు. అలాగే టీ త్రాగే సమయమైంది. కుటీరంలో టీ పొడుము, చెక్కెర వున్నాయి గాని పాలులేవు. అనుకోగానే అకస్మాత్తుగా ఒక వ్యక్తి వచ్చి 2 లీటర్ల పాలుపోసి వెళ్ళిపోయాడు.

వీరిలో ఘనశ్యాంసింగ్ ప్రతిరోజూ అర్ధరాత్రి వరకూ ఆ ఫకీరుగారి సేవచేస్తుండేవాడు. జీవితాంతము బ్రహ్మచారిగా వారి సేవలోనే వుండాలని ఆశించాడు. ఒకరాత్రి ఆ ఫకీరు నవ్వి, "నీకు పెళ్ళవుతుంది. ముగ్గురు బిడ్డలు కల్గుతారు" అన్నారు. అలానే జరిగింది. అక్టోబరు 28, 1964 సాయంత్రం 7 గంటలకు ఆ ఫకీరు, "ఆవో జిబ్రాయిల్! ఏ మేరా ఆర్డర్ హై!" (దేవదూత అయిన ఓ జిబ్రాయిలూ, ఇటురా! ఇది నా ఆజ్ఞ!") అని పెద్దగా కేకలేశారు. ఇక 4 గంటలలో తాము సమాధి కాబోతున్నామని చెప్పారు. సరిగా 11-45 గం॥కు "అల్లాహో!" అని ఏడుసార్లు స్మరించి భగవంతునిలో ఐక్యమయ్యారు.

ఒకరోజు ఈ ఫకీరును, "మీ గురువెవరు" అని అడిగాడు ఘనశ్యామ్. 'రేపు చెబుతా'మన్నారు. మరుసటి ఉదయమే 8 గం॥లకు అతనిని బయటికెళ్ళి సూర్యుని చూడమని సైగ చేశారు. చూడగా ఆ బింబంలో 5 ని॥లపాటు ద్వారకామాయిలో కూర్చున్న సాయిబాబా ముఖం దర్శనమిచ్చింది. ఆశ్చర్యంతో ప్రణమిల్లిన ఘనశ్యామ్‌కు, "నిన్నటి నీ ప్రశ్నకు సమాధానమిదే" అన్నట్లు చిన్న సైగచేసి నవ్వారా ఫకీరు!

శ్రీరామ మారుతీ మహరాజ్ : సం॥1910లో ఒకరోజు బొంబాయి నుండి వచ్చిన త్రయంబకరావు, కులకర్ణి, మార్తాండ్ మొ॥న భక్తులతో సాయి, "రేపు మాకు పర్వదినం దీపావళి!" అన్నారు. మరురోజుదయమే ఆయనెంతో సంతోషంగా, "ఈ రోజు నన్ను చూడడానికి నా తమ్ముడొస్తున్నాడు. ఒకప్పుడు మా యిద్దరి భార్యల మధ్య తగువొచ్చింది మేము వేరుగా వుంటున్నాం." అన్నారు. మధ్యాహ్నం ఆరతికి ముందు నానాచందోర్కర్‌తో, "మారుతి వస్తున్నాడు!' ' అన్నారు. ఆరతి ప్రారంభమైన కొద్దిసేపట్లో థాణే నుండి తమ భక్తులతో కలసి శ్రీరామ్ మారుతీ మహరాజ్ అను మహనీయుడొచ్చారు. వెంటనే సాయి ఆరతి ఆపించి, తమ సోదరుని చూచి తమ చెంతకు రమ్మనట్లు నవ్వారు. తండ్రి దగ్గరకు బిడ్డలాగా రామమారుతి పరుగున వెళ్ళి సాయిని కౌగలించుకొని, ముద్దు పెట్టుకున్నారు. వారు ఒకరిచేతులొకరు ఎంతో ఆప్యాయంగా పట్టుకుని కూర్చున్నారు. తర్వాత ఆరతి కొనసాగించమని సాయి ఆదేశించారు. ఆరతి అయ్యాక ఆ మహనీయుడు ఖండోబాకు వెళ్ళి అక్కడ నివసిస్తున్న ఉపాసనీ శాస్త్రితో, 'రామునిసేవ విడువకు!' అని చెప్పారు. అక్కడ తమ భక్తులతో సాయికి నైవేద్యంగా 'శీరా' (రవ్వకేసరి) తయారు చేయించారు. ఈలోగా బాబావద్దకు భక్తులెందరో తమ నైవేద్యాలను తెచ్చి సమర్పించారు. "ఉండండి, ఈరోజు మొదట నా తమ్ముడిచ్చే నైవేద్యం తీసుకోవాలి" అని కొద్దిసేపు వేచియున్నారు బాబా. అది రాగానే ఎంతో సంతోషంగా దానిని కొంచెం తిని, తర్వాత మిగిలిన నైవేద్యాలు తీసుకున్నారు. నాటి మధ్యాహ్నము, సాయంత్రం చావడి ఉత్సవంలోనూ ఆ మహాత్ముణ్ణీ తమ చెంతనే వుంచుకుని రాత్రి మాత్రం ఆయనను ఖండోబాలో నిద్రించమని పంపించారు సాయి. ఈ రీతిన తన తమ్ముని 14 రోజులు తమ చెంతనుంచుకుని పంపించారు సాయి.

శ్రీరామ మారుతీ మహరాజ్ శ్రీ బాలముకుందస్వామిని గురువుగా ఆశ్రయించినా, తమ పరాత్పర గురువు సాయినాథుడేనని చెప్పేవారు. తాననుసరించిన నాథ సాంప్రదాయానికి ఆదిపురుషుడైన ఆదినాథుడే సాయి నాథుడనేవారు. వీరు సెప్టెంబరు 28, 1918న మహాసమాధి చెందారు. బహుశః ఎన్నో జన్మలుగా తమ శిష్యుడిగా వుంటున్న మారుతీ మహరాజ్ ఈ జన్మలో వేరొక గురువునాశ్రయించడాన్నే "వారి భార్యల (మనస్సుల) తగవు" గా సాయి అభివర్ణించారేమో!

శ్రీ శాంతావన్‌జీ మహారాజ్ : వీరు గుజరాత్‌లో గొప్ప మహనీయులు. వీరు సాధకదశలో చాలాకాలం హిమాలయాలలో వుండి తర్వాత గంగాతీరంలో బ్రహ్మచారిగా 30 సం॥లు తీవ్రమైన గాయత్రీ ఉపాసనలో గడిపారు. వారొకసారి తమ అనుభవమొకటి చెప్పారు. "నేనొకప్పుడు పాలనపురం వద్ద బలరామ క్షేత్రంలో గాయత్రి సాధన చేస్తున్నాను. ఒకసారి మనస్సెంతకూ ఏకాగ్రమవలేదన్న నిరాశతో నదిలో దూకి ఆత్మహత్య చేసుకోదలచాను. ఒక శివ మందిరంలో దేవిని ప్రార్థించి, గాయత్రిని స్మరించి నదిలో దూకబోతుండగా ఒక ఫకీరు నావద్దకొచ్చారు. ఎంతో తేజోవంతమైన కళ్ళు, గడ్డముగల ఆయనెంతో మధురంగా నవ్వుతూ వచ్చి నా చేయి పట్టుకొని తమవెంట రమ్మన్నారు. నేను మంత్ర ముగ్ధుడనై వారి వెనుకనే నడచాను. వారు నాకు 'కలోల్' గ్రామానికి టికెట్టు యిచ్చి అకస్మాత్తుగా అదృశ్యమయ్యారు. ఆయనెవరో నాకర్థంగాలేదు. కొంతకాలం తర్వాత నేను తరచూ హిమాలయాలకు వెళ్ళి, చివరకు నర్మదాతీరంలోని 'కరణాలీ' లో స్థిరపడ్డాను. పై దర్శనమైన 30 సం॥ల తర్వాత 1976లో సూరత్‌లోని సాయిబాబా మందిరంలో దత్త జయంతికి గాయత్రి యజ్ఞము చేయమని నన్ను భక్తులాహ్వానించారు. నేనంతవరకూ

ఏ సాయిబాబా మందిరమూ చూడలేదు. అక్కడొక రాత్రి బాబా స్పష్టంగా కలలో కనిపించి, 'నన్ను మరిచి పోయావా? 30 సం॥ల క్రిందట బలరామక్షేత్రంలో నదిలో దూకి ఆత్మహత్య చేసుకోబోతుంటే నిన్ను రక్షించినదెవరు?' అన్నారు. నాకెంతో ఆనందం కల్గింది. మరురోజు నేను ధ్యానానికి కూర్చోగానే గాయత్రీదేవి బదులు నాకు సాయిబాబా దర్శనమిచ్చి ప్రగాఢమైన ఆనందమనుగ్రహించారు. మరింత భక్తి శ్రద్ధలతో ఆ మందిరంలో సాయిపూజ, గాయత్రీ యజ్ఞమూ ముగించాను.

గజానన్ మహరాజ్ : గజానన్ పట్టేకర్ అను యువకునికి 8వ యేట ఉపనయనం చేశాక, అతని పినతండ్రి అతనికి మహనీయుల దర్శనము, ఆశీస్సులు యిప్పించడానికి అతనిని షహపూర్ వద్ద నది ఒడ్డున వున్న ఉదుంబరవృక్షం క్రింద విడిదిచేసిన ముగ్గురు సాధువులవద్దకు తీసుకువెళ్ళి, వారికి నమస్కారం చేయించాడు. వారిలో ఒకరు గురుకృప వలన పట్టేకర్, మహనీయుడు అవుతాడని ఆశీర్వదించారు. తర్వాత అతని కుటుంబానికి సుపరిచితుడైన నానాచందోర్కర్ శిరిడీ దర్శించినపుడు బాబా, "నీ మిత్రుని కొడుకు గజానన్ నన్ను షహపూర్‌లో నది ఒడ్డునున్న ఉదుంబర వృక్షంక్రింద దర్శించుకున్నాడు. నేనపుడతనిని ఆశీర్వదించాను. అపుడు నాతోకూడా గురుసిద్ధారూఢులు (హుబ్లీ), కళ్యాణ్ నివాసియైన రామ్ మారుతీ స్వామికూడ వున్నారు. నీవుగూడ అవకాశమున్న ప్పుడల్లా అక్కడ నదిలో స్నానంచేసి అచటి నా స్థానాన్ని గూడ దర్శించుకో!" అని చెప్పి పట్టేకర్‌కు ప్రసాదంగా పాలకోవా పంపారు.

ఆ మాటవిని ఆశ్చర్యపోయాడు నానాచందోర్కర్. తరువాత అతడు హేమాద్‌పంత్‌తో కలిసి మళ్ళీ శిరిడీ వెళ్ళినపుడు సాయి, "మీ గజానన్ ఆ మారుతి ఆలయంలో యింకెంతకాలముంటాడు?" అన్నారు. తర్వాత హేమాద్పంతు, "సాయి సచ్చరిత్ర" ప్రతిని షహపూర్‌లోని ఆ ఉదుంబర వృక్షంక్రింద వుంచి పూజించాడు. అంగోన్‌కవాడ్‌కు చెందిన సఖారం మహరాజ్, గాడ్గే మహరాజ్ మొ॥న మహాత్ములు గూడ ఆ చెట్టుక్రింద తపస్సు చేసుకున్నారు. తర్వాత సాయి చెప్పినట్లే గజానన్ పట్టేకర్ ఎందరో మహనీయులను దర్శించి, రత్నగిరి జిల్లాలోని పటగాం నివాసియైన శ్రీ దాదా మహరాజ్ అను మహనీయుని అనుగ్రహానికి పాత్రుడై, తర్వాత గజానన్ మహరాజ్‌గా ప్రసిద్ధికెక్కాడు. అలనాడు సాయితో కలిసి ఆ వృక్షంక్రింద అతనికి దర్శనమిచ్చిన రామ్‌మారుతీ మహరాజ్ సాక్షాత్తూ మారుతియేనని చెప్పి, అక్కల్‌కోట స్వామిగూడ కొందరు భక్తులను వారి దర్శనానికి పంపేవారు. ఈ రామమారుతి మహరాజ్ తమ భక్తులతో శ్రీ గురుసిద్ధారూఢులు, శ్రీ సాయిబాబా వేరుకాదని తెల్పే ఎన్నో అనుభవాలు చెబుతుండేవారు.

ఇమాంభాయి చోటేఖాన్ అనే భక్తుడిలా అన్నాడు : "నాకు తెలిసిన ఇద్దరు ముస్లిములు బాబావల్ల ఉద్ధరింపబడ్డారు. మా ఊరికి చెందిన షేక్ అబ్దుల్లాతో బాబా, "మనమీ రోజు చనిపోయినా, మామూలుగానే మూడవ రోజు గూడ గడిచిపోతుంది. ఇల్లు, భూమి మొ॥న వాటివల్ల ఏమిటి ప్రయోజనం?' అన్నారు. షేక్ అబ్దుల్లా స్వగ్రామానికి తిరిగొచ్చి, తన ఇల్లూ-వాకిలీ భార్యాబిడ్డలకు అప్పగించి వీధులలోనూ, మహాత్ముల సమాధుల దగ్గర కాలం గడుపుతూ, ఎప్పుడూ తనలో తాను గొణుక్కుంటూండేవాడు. అడగకుండా ఎవరైనా పెడితేనే తినేవాడు. అతనికి 12 సం॥లలో అద్భుత శక్తులు ప్రాప్తించాయి. ఒకప్పుడు నేను ప్రయాణమవుతుంటే నన్ను వెళ్ళవద్దని, ఒకచోట పాము తారసిల్లుతుందన్నాడు. అది పగలు కావడాన నేనతని మాట వినలేదు. అతడు చెప్పినచోట పాము కనిపించింది. మరోసారి అతనితో మావూళ్ళో బీడీలమ్ముకొనే అబ్బాసేట్, 'భార్యాబిడ్డలను విడిచి ఎందుకు పిచ్చివాడిలా తిరుగుతావ్?' అన్నాడు. 'నీకే తెలుస్తుందిలే!' అన్నాడు అబ్దుల్లా. అబ్బాస్ మళ్ళీ అట్లానే అన్నాడు. అతనివైపుకు అదృశ్య వస్తువు విసిరినట్లు తన పిడికిలి విసిరి, 'నువ్వూ అలాగే అవుగాక!' అన్నాడు అబ్దుల్లా. అబ్బాసేట్

ఆ క్షణంలోనే యిల్లు, వ్యాపారము విడిచి, పిచ్చివాడై వీధులపాలైనాడు.

భోపాల్‌నుండి అన్వర్‌ఖాన్ అనే వ్యక్తి ఒకప్పుడు శిరిడీవచ్చి చావడిలో 12 మాసాలున్నాడు. అతడు తనకు సంసారం వద్దన్నాడు. ఖురాన్ మొదటి అధ్యాయంలోని ఒక వాక్యాన్ని అర్థరాత్రి 101 సార్లు జపించమని 'దరూద్' అనే అధ్యాయం పఠించమనీ కూడ సాయి చెప్పారు. తర్వాత బాబా అతనికి పాలకోవా ప్రసాదంగా యిచ్చి, అరేబియాలోని బాగ్దాదు నగరానికి పొమ్మని ఆదేశించారు. అతను బొంబాయి చేరేసరికి అక్కడ ఖాసిం అను శ్రీమంతుడొకడు చిత్రంగా అన్వర్‌ఖాన్ అరేబియా వెళ్ళే ఏర్పాట్లు చేశాడు. అతడు మరెప్పుడూ తిరిగి రాలేదు.

హీడాబేగ్ అను భక్తుడు సాయిని దర్శించాడు. అప్పుడు ఢిల్లీనుంచి యాకూబ్ అనే మౌల్వీగూడ శిరిడీవచ్చి, అహర్నిశలూ ఖురాన్ పారాయణ చేస్తుండేవాడు. సాయి ఒకరోజు రాత్రి 3గం॥లకు హీడాబేగ్‌తో, 'నువ్విక్కడుండ వద్దు. కణాడ్ సమీపంలోని కంటోన్మెంట్ దగ్గరుండు. నీపేరు 'పంజాబ్ షా' అన్నారు. ఇతడు కణాడ్‌లో గొప్ప హకీమ్‌గా పేరుపొందాడు".

★★★